క్లుప్తంగా

విద్యార్థులు సంస్కృతి పరిరక్షకులుగా ఎదగాలి



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించే పౌరులుగా ఎదగాలని పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి పేర్కొన్నారు. రింగ్‌రోడ్డులోని సాయి ఆదిత్య స్కూల్లో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యతో విద్యార్థులు మంచి పౌరులుగా ఎదుగుతారని, ప్రాచీన సంప్రదాయాలను మరచిపోకుండా సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్, పాఠశాల డైరెక్టర్లు మోదేపల్లి రవీంద్రబాబు, సూరె రామ్మోహనరావు, ప్రిన్సిపాల్ సుజాత, వైస్ ప్రిన్సిపాల్ సీతామహాలక్ష్మి, ఇన్‌చార్జ్‌లు సుబ్బారాయుడు, కృష్ణారావు పాల్గొన్నారు.

మాస్టర్‌మైండ్స్ విజయోత్సవ ర్యాలీ



గుంటూరు ఎడ్యుకేషన్: ఐసీఏఐ ఇటీవల ప్రకటించిన సీఏ ఫైనల్ పరీక్షా ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ విద్యాసంస్థల విద్యార్థులు అఖిల భారతస్థాయిలో ప్రథమ ర్యాంకుతో పాటు 33, 34, 40వ ర్యాంకులను కైవసం చేసుకున్న సందర్భంగా సంస్థ సిబ్బంది శనివారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బ్రాడీపేటలోని సంస్థ ప్రధాన క్యాంపస్ వద్ద అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీని ఇన్‌చార్జిలు వైఎస్సార్, ఆంజనేయ విజయకుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా క్యాంపస్ ఇన్‌చార్జి వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ కామర్స్ కోర్సుల్లో అగ్రస్థానంలో కొనసాగుతున్న మాస్టర్‌మైండ్స్ తాజా ఫలితాల్లో మరోసారి తన స్థానాన్ని పదిలం చేసుకుందని చెప్పారు.

ప్రధాన కూడళ్లల్లో జిల్లా ఎస్పీ పర్యటన



నగరంపాలెం: నగర పరిధిలోని ప్రధాన కూడళ్లల్లో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆకస్మికంగా పర్యటించారు. ఈ మేరకు శనివారం రాత్రి ప్రభుత్వ మహిళా కళాశాల కూడలి, శంకర్ విలాస్ కూడలిలో కలియ తిరిగారు. ఏయే వేళల్లో వాహనాల రద్దీగా ఉంటున్నాయి, ఎలా క్రమబద్ధీకరిస్తున్నారు, ఆయా కూడళ్లల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుపై ట్రాఫిక్ డీఎస్పీ రమేష్‌ను జిల్లా ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద వాహనదారులు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. అదే విధంగా శంకర్ విలాస్ ఓవర్ బ్రిడ్జిపైకి వచ్చే, పోయే వాహనాలు ఒక క్రమపద్ధతిలో వెళ్లే విధంగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ వెంట ట్రాఫిక్ పశ్చిమ పీఎస్, ట్రాఫిక్ తూర్పు పీఎస్ సీఐలు సింగయ్య, ఎ.అశోక్‌కుమార్ ఉన్నారు.

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



లక్ష్మీపురం: రాష్ట్రంలో మధ్యాహ్న భోజనం పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్‌కు విన్నవించారు. నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు, సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ 2019కి ముందు విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియెట్ విద్యార్థులకు కార్మికులు భోజనం వండి, వడ్డించడం జరిగిందని వాటికి సంబంధించిన పెండింగ్ బిల్లులను, వేతనాల బకాయిలను, మెస్ చార్జీలను విడుదల చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ పథకమైనటువంటి మధ్యాహ్న భోజన పథకం లో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పిస్తూ ఐడీ కార్డులు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, వేతనాలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య, జిల్లా కార్యదర్శి యశ్వంత్, నగర కార్యదర్శి ప్రణీత్ పాల్గొన్నారు.

పోస్టింగ్ ఇచ్చారు... తిరిగి లాక్కున్నారు..!

- ఏఈల కొరతతో వార్డు ఎమినిటీ సెక్రటరీలను ఇన్‌చార్జి ఏఈ బాధ్యతలు
- రోస్టర్, సీనియార్టీ, మెరిట్, విద్యార్హత చూడకుండానే సిఫార్సులతో ఇన్‌చార్జి ఏఈలుగా బాధ్యతలు అప్పగింత
- వ్యతిరేకతతోఇన్‌చార్జి ఏఈల నుంచి తొలగింపు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థలో ఇన్‌చార్జి ఏఈల బాధ్యతలపై వివాదం నెలకొంది. ఏఈల కొరతతో వార్డు ఎమినిటీ సెక్రటరీలను ఇన్‌చార్జి ఏఈలుగా వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే గత కొద్ది నెలలుగా వార్డు ఎమినిటీ సెక్రటరీలు ఇన్‌చార్జి ఏఈలుగా వ్యవహరిస్తున్నారు.

ఇన్‌చార్జి ఏఈలుగా బాధ్యతలు అప్పగింతలో సీనియార్టీ, రోస్టర్, మెరిట్, విద్యార్హతలు ఇవేమి చూడకుండానే పోస్టింగ్ ఇవ్వడంపై పలువురు సెక్రటరీలు అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై దుమారం రేగడంతో కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇన్‌చార్జి ఏఈ బాధ్యతల నుంచి సెక్రటరీలను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

చక్రం తిప్పిన కమిషనర్ చాంబర్ ఉద్యోగి

నగరంలో 206 వార్డు సచివాలయాలకు సుమారు 125 మంది వరకు వార్డు ఎమినిటీ సెక్రటరీలు ఉన్నారు. మిగిలిన వారంతా గతంలో నిర్వహించిన సెక్రటరీల బదిలీలలో వేరే ప్రాంతానికి వెళ్లారు. వీరికి ఇన్‌చార్జి ఏఈలుగా పోస్టింగ్ ఇచ్చేందుకు సెక్రటరీలకు గత కొద్ది నెలల క్రితం కౌన్సెలింగ్ నిర్వహించారు. మీలో ఎవరూ ఇన్‌చార్జి ఏఈలుగా ఉండాలనుకుంటున్నారో వారి పేర్లు ఇవ్వాలని చెప్పడంతో సుమారు 25 మంది దాకా తమ పేర్లు ఇచ్చారు.

ఈ 25 మందిలో 10 మందిని తమకు నచ్చిన వారికి ఎటువంటి సీనియార్టీ, రోస్టర్ లేకుండానే పోస్టింగ్ ఇచ్చారు. ఇందులో కొసమెరుపు ఏమిటంటే ఈ పది మందిలో ఇద్దరు, ముగ్గురు సెక్రటరీలు రెండు, మూడేళ్లు విధులకు గైర్హజరై, వేరే విధులు చేసుకుంటు తిరిగి సెక్రటరీలుగా విధుల్లో చేరిన వారికి ఇన్‌చార్జి ఏఈలుగా పోస్టింగ్ ఇచ్చారు. ఈ పోస్టింగ్‌లో వ్యవహారంలో కమిషనర్ చాంబర్‌లో పనిచేసే ఓ ఉద్యోగి చక్రం తిప్పినట్లు సమాచారం.



వార్డు సచివాలయం

వార్డు ఎమినిటీ సెక్రటరీ నుంచి వ్యతిరేకతతో..

ఇన్‌చార్జి ఏఈలుగా పోస్టింగ్ ఇచ్చిన పది మందికి ఎటువంటి సీనియార్టీ, రోస్టర్ లేకుండానే పోస్టింగ్ ఇవ్వడంపై కొంత సెక్రటరీలు సదరు పోస్టింగ్‌లపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దీంతో సెక్రటరీలకు తిరిగి రెండో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్‌లో కూడా కొంత మంది పేర్లు ఇచ్చినా సదరు పేర్లు రాకుండానే పాత పేర్లతో మరి పోస్టింగ్ ఇస్తూ కమిషనర్ గత ఏడాదిలో సెప్టెంబర్‌లో ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై కూడా నిరసన రాగం సెక్రటరీల నుంచి రావడంతో కమిషనర్ పులి శ్రీనివాసులు డిసెంబర్ 31వ తేదీ రాత్రి ప్రస్తుతం ఇన్‌చార్జి ఏఈలుగా పనిచేస్తున్న సెక్రటరీల విధుల నుంచి తొలగిస్తు ఉత్తర్వులు జారీ చేశారు.

నెల్లూరు పబ్లిక్ హెల్త్ ఎస్ఈ సిఫార్సు మేరకే..

వార్డు ఎమినిటీ సెక్రటరీలకు ఇన్‌చార్జి ఏఈ పోస్టింగ్ ఇవ్వడంపై దుమారం రేగడంతో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, నెల్లూరు జిల్లా పబ్లిక్ హెల్త్ ఎస్ఈ(జోనల్ ఆఫీసర్) ఆదేశాల మేరకు పోస్టింగ్ ఇచ్చేందుకు నిర్ణయించారు. దీనికి సంబంధించి ఎమినిటీ సెక్రటరీల వివరాలను నెల్లూరు ఎస్ఈకి పంపారు. సెక్రటరీల సీనియార్టీ, రోస్టర్, మెరిట్, విద్యార్హతలను పరిగణనలోకి వారు ఇచ్చే జాబితా మేరకు తిరిగి గుంటూరు నగరపాలక సంస్థలో సెక్రటరీలకు ఇన్‌చార్జి ఏఈలుగా పోస్టింగ్‌లు ఇచ్చేందుకు కసరత్తు మొదలైంది.

స్వామి వివేకానంద ఆలోచనలు యువతకు మార్గదర్శకం



గుంటూరు ఎడ్యుకేషన్: స్వామి వివేకానంద ఆలోచనలు యువతకు మార్గదర్శకాలుగా నిలుస్తాయని ఏఎన్‌యూ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆచార్య పి.బ్రహ్మజీ పేర్కొన్నారు. శనివారం అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో జాతీయ యువజనోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బ్రహ్మజీ మాట్లాడుతూ యువత రేపటి భవిష్యత్తుకు వెన్నెముక అని, స్వామి వివేకానందుని సూక్తులతో ఉత్తేజితులు కావాలన్నారు. యువతరం తమలోని శక్తిని జ్ఞాన సేకరణ, నూతన ఆవిష్కరణ, సేవకు వినియోగించుకోవాలని సూచించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ వివేకానందుడు చారిత్రక ప్రసంగాలతో భారతీయ సంస్కృతిని పరిచయం చేశారని చెప్పారు. ఈసందర్భంగా వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ, ప్రోగ్రామ్ కన్వీనర్ ఎ.బాజీబాబు, కో–కన్వీనర్ చల్లా వైష్ణవి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు అన్యాయం

- కార్పొరేషన్‌లో కార్పొరేటర్ల ధ్వజం
- మాజీ ప్రధాని మన్మోహన్ మృతికి సంతాపం
- కౌన్సిల్ మళ్లీ వాయిదా

నెహ్రూనగర్: రోడ్ల వెంట వీధి వ్యాపారం చేసుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటున్న చిరు వ్యాపారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని కార్పొరేటర్లు రోషన్, అచ్చాల వెంకటరెడ్డి, చిష్టి ప్రశ్నించారు. డిసెంబర్ 20వ తేదీన వాయిదా పడిన కౌన్సిల్ సమావేశం శనివారం నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు పాల్గొన్నారు. తొలుత ఇటీవల మరణించిన మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు కౌన్సిల్ మౌనం పాటించి, సంతాపం తెలిపింది.

మార్చి చివరి నాటికి వెండింగ్ జోన్లు..

గుంటూరు నగరంలో వీధి వ్యాపారం పేరుతో ఒక మాఫియా నడుస్తుందని... దీనిని కట్టడి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. లైవ్‌లో ఉండేది ఒకరు ఐడీ కార్డు ఒకరి పేరు మీద.. ఒకే సారి రోడ్డు అక్రమించి నాలుగైదు వ్యాపారాలు చేస్తున్నారు. వీరందరిని పరిశీలిస్తున్నామని, మార్చి చివరి నాటికి నిజంగా వ్యాపారం చేసుకునే వారిని గుర్తించి, వారి స్థితిగతులు పరిశీలించిన తరువాత వారికి గుర్తింపు కార్డులు ఇవ్వడం జరుగుతుందని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. వారు మాత్రమే వెండింగ్ జోన్స్‌లో వ్యాపారం చేసుకునేందుకు అనుమతిని ఇస్తామని కమిషనర్ పులి శ్రీనివాసులు చెప్పారు.



మేయర్ కావటి మనోహర్ నాయుడు

అక్రమ కట్టడంపై ఫిర్యాదు చేసిన నో రెస్పాన్స్

29వ డివిజన్‌లో డ్రెయిన్‌ను ఆధారం చేసుకుని ఓ ఇళ్లు నిర్మాణం చేపట్టడంపై టౌన్ ప్లానింగ్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ స్పందించలేదు.. తీరా ఇళ్లు పూర్తయిన తరువాత వచ్చి ఇంటి నిర్మాణాన్ని ఫొటో తీసుకుని చేతులు దూలుపుకున్నారు. అదే ఎవరైన పేదవారు చిన్న రేకుల షెడ్ వేసుకోవాలంటే కూడా వారిని వేసుకోనివ్వకుండా ముప్పు తిప్పలు పెట్టి వారిని ఇబ్బందులకు గురిచేసేవారిని కాని అక్రమ కట్టడం గురించి చెప్పిన టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు స్పందించలేదంటూ కార్పొరేటర్ రోషన్, అధికారులను నిలదీశారు. శనివారం కూడా సభ వాయిదా పడటంతో తరువాత జరగబోయే సమావేశ తేదీని అధికారులతో చర్చించిన తరువాత ప్రకటిస్తామని మేయర్ కావటి ప్రకటించారు.

కక్ష సాధింపు చర్యలకు దిగిన కమిషనర్!

మేయర్ వద్ద పనిచేస్తున్న డ్రైవర్‌ను కూడా తొలగించి వేరే విధులకు కేటాయింపు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ సాధారణ కౌన్సిల్‌లో చోటుచేసుకున్న చిన్న ఘటనను దృష్టిలో ఉంచుకుని మేయర్, డెప్యూటీ మేయర్ల వద్ద పనిచేసే సిబ్బంది తొలగిస్తూ కమిషనర్ పులి శ్రీనివాసులు నిర్ణయం తీసుకున్నారు. నగర మేయర్ కావటి మనోహర్ వద్ద పనిచేస్తున్న ఆరుగురు సిబ్బందిని, డెప్యూటీ మేయర్ల వద్ద పనిచేస్తున్న ముగ్గురి సిబ్బందిని కమిషనర్ చాంబర్‌కు కమిషనర్ శనివారం సాయంత్రం పిలిపించుకుని మీరు గతంలో ఎక్కడైతే పనిచేశారో అక్కడికి వెళ్లి విధులు నిర్వహించాలని ఆదేశించడంతో డెప్యూటీ మేయర్ల వద్ద చేరోక అటెండర్, మేయర్ వద్ద ఒక పీఏ, ఒక అటెండర్ మాత్రమే ఉన్నారు. నగర ప్రథమ పౌరుడైన మేయర్‌కు కారు నగరపాలక సంస్థే సమకూరుస్తుంది. ఆయనకు ఇద్దరు డ్రైవర్లు ఉండాల్సి ఉండగా... ఇద్దరు డ్రైవర్లును తొలగించి.. వారిని వేరే విధులకు వెళ్లాలని కమిషనర్ ఆదేశించారు. కౌన్సిల్ జరిగిన అంశాన్ని సాకుగా చూపి కమిషనర్ కక్ష సాధింపు చర్యలకు దిగడంపై పలువురు కౌన్సిల్ సభ్యులు కమిషనర్ తీరును తప్పుబట్టారు. సిబ్బంది తొలగింపు నగర మేయర్ స్పందించారు. సిబ్బంది తొలగింపుపై లిఖితపూర్వకంగా రాసి ఇవ్వాలని మేనేజర్‌ను ఆదేశించారు. గతంలో మేయర్లుగా పని చేసిన వారికి ఏ విధంగా ప్రొవిజన్స్ కల్పిస్తున్నారో ఆదే విధంగా తనకు సిబ్బందిని కేటాయించాలని, అంతకు మించి ఎటువంటి సిబ్బంది తనకు అవసరం లేదని మేనేజర్‌కు వివరించారు.

'పీకల' లోతు కష్టాలు



34వ డివిజన్ కోబాల్డ్‌పేట 5వ లైన్‌లోని పీకల వాగులో పేరుకు పోయి ఉన్న మురుగు,చెత్త



సైడ్ డ్రెయిన్‌లో అడ్డుగా ఉన్న వ్యర్థాలు

- పారిశుద్ధ్య సమస్యలతో స్థానికులు సతమతం
- పీకల వాగు, సైడ్ డ్రెయిన్‌లలో పేరుకుపోతున్న మురుగు
- ఖాళీ స్థలాల్లో పెరిగి పోయిన పిచ్చి మొక్కలు
- రోగాల బారిన పడుతున్న స్థానికులు

లక్ష్మీపురం: నగరవాసులు పీకల లోతు కష్టాలతో నలిగిపోతున్నారు. పారిశుద్ధ్యం, డ్రెయినేజీ వంటి సమస్యలు నిత్యం వెంటాడుతున్నాయి. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 34వ డివిజన్ కోబాల్డ్‌పేట వాసులు పారిశుద్ధ్య సమస్యలతో సతమతం అవుతు రోగాల బారిన పడుతున్న సంబంధిత నగరపాలక సంస్థ అధికారులు చోద్యం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలు.. 34వ డివిజన్ పరిధిలో సుమారు పది వేల మంది పలు వ్యాపారాలు, ఉద్యోగాలు, పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. ఈ ప్రాంతంలో నిత్యం పారిశుధ్య సమస్యలతో ఇబ్బందులు పడుతునే ఉన్నారు. ప్రధానంగా ఈ ప్రాంతంతో పాటు 34,35,36 డివిజన్‌ల పరిధిలో దేవాపురం, కోబాల్డ్‌పేట, బ్రాడిపేట ప్రాంతాల వీదుగా పీకల వాగులో మురుగు నీరు వెళ్లేందుకు రూపకల్పన చేశారు. పీకల వాగు చుట్టు ఆయా ప్రాంతాల వాసులు నిత్యం రోగాల బారిన పడుతునే ఉన్నారు. ఈ పీకల వాగులో పేరుకు పోతున్న మురుగు నీరు సకాలంలో తొలిగించక పోవడంతో సిల్ట్, మురుగు, చెత్త నిల్వ పేరుకుపోతోంది. స్థానికంగా నివాసం ఉండే వారు రోగాల బారిన పడి నిత్యం ఆస్పత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 34వ డివిజన్ పరిధిలో కోబాల్డ్‌పేటలో1వ లైన్ నుంచి 7వ లైన్ వరకు గత కొన్ని రోజులుగా సైడ్ డ్రెయినేజీలలో మురుగు పేరుకు పోయింది. పారిశుద్ధ్య పనులు సకాలంలో చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

ల్యాబ్ నివేదికల్లో కచ్చితత్వం పాటించాలి

గుంటూరు మెడికల్: ల్యాబ్ రిపోర్ట్‌లలో కచ్చితత్వం పాటించాలని, కీటకాల ద్వారా వ్యాపించే వ్యాధులపై మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్‌లు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అన్నారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ల్యాబ్ రిపోర్ట్‌ల రిజిస్ట్రార్లు ప్రతినెలా అప్‌డేట్‌గా ఉండాలని చెప్పారు. నివారణ చర్యల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

డిజిటల్ సిస్టమ్ డిజైన్ రంగంలో ఉజ్వల భవిష్యత్



గుంటూరు ఎడ్యుకేషన్: డిజిటల్ సిస్టమ్ డిజైన్ రంగంలో యువతకు ఉజ్వల భవిష్యత్ ఉందని పొన్నూరు పీబీఎన్ కళాశాల అధ్యాపకురాలు వి.సుజన పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ డిగ్రీ కళాశాలలో శనివారం డిజిటల్ సిస్టమ్ డిజైన్‌పై అతిథి ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సుజన మాట్లాడుతూ డిజిటల్ సిస్టమ్ డిజైన్‌లో బిల్డింగ్ బ్లాక్స్, సిస్టంను రూపొందించే ప్రక్రియ అని, ఇందులో వీఎల్ఎస్ఐ డిజైన్ ఎంతో కీలకమన్నారు. తక్కువ ఖర్చుతో శక్తివంతమైన ఎలక్ట్రానిక్ పరికరాలను ఉత్పత్తి చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి భానుమురళి, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి బి.శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

10న సీపీఐ ఆధ్వర్యంలో అర్జీలు అందజేసే కార్యక్రమం

లక్ష్మీపురం: పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ కోరారు. కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈనెల 10వ తేదీన అన్ని తాలూకా కార్యాలయాల వద్ద ఆయా లబ్ధిదారులను సమీకరించి అర్జీలు అందించనున్నట్లు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు దాటుతున్నా సూపర్ సిక్స్ పథకాల అమలు గురించి వాటి చిరునామా ఎక్కుడుందో కూడా ప్రజలకు అర్థం కావడం లేదన్నారు. ప్రజలను కూటమి ప్రభుత్వం మోసం చేస్తున్నట్లు విమర్శించారు. ప్రపంచ మేధావిగా పేరుగాంచిన డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌పై అమిత్ షా సాక్షాత్తు రాజ్యసభలో అవమానకరంగా మాట్లాడితే దానిపైన ఈ రాష్ట్రంలో ఉన్నటువంటి చంద్రబాబు గాని, పవన్ కనీసం ఖండించకపోవడం అనేది దుర్మార్గమన్నారు.

అలరించిన విశ్వంభర భజన..

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పాలకమండలి అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, టీటీడీ ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో జరగ్గా, తిరుప్పావై అమృతవర్షిణి డాక్టర్ కోగంటి వెంకట రంగనాయకి తిరుప్పావై ప్రవచనం, కోళ్ల చిట్టెమ్మ, రావి పూడి రమాదేవి నిర్వహణలో పెదనందిపాడు విశ్వంభర భజన సమాజం వారి భజన చేపట్టారు.

లీలా కార్తికేయ ఆసుపత్రిలో అరుదైన చికిత్స

గుంటూరు మెడికల్: మిల్లర్ ఫిషర్ వేరియంట్ ఆఫ్ గులియన్ బరి సింద్రోమ్(జీబీ సింద్రోమ్) అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న బాలుడికి మెరుగైన వైద్య సేవలు అందించి ప్రాణాలను కాపాడినట్లు లీలా కార్తికేయ ఆస్పత్రి అధినేత, సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్ వేమూరు నాగ శంకర్ శనివారం తెలిపారు. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేసానుపల్లికి చెందిన 16 సంవత్సరాల ఎం.శివ అరుదైన వైద్య సేవలు అందించినట్లు చెప్పారు. సరైన సమయంలో గుర్తించి ఆ బాలుడికి వైద్య సేవలు అందించడంతో ప్రస్తుతం ఆ బాలుడు పూర్తి ఆరోగ్యంగా కోలుకున్నాడని పేర్కొన్నారు. లక్ష మందిలో ఇద్దరు లేదా ముగ్గురికి మాత్రమే ఈ వ్యాధి సోకే ప్రమాదం ఉందని వెల్లడించారు. ఇటువంటి అరుదైన వ్యాధి సోకిన పేషెంట్ శివకు మెరుగైన వైద్య సేవలు అందించి కాపాడినట్లు పేర్కొన్నారు. ప్రాణాపాయ స్థితి నుంచి తమ బాలుడిని కాపాడిన డాక్టర్ నాగ శంకర్‌కు బాలుడి తల్లి ధన్యవాదాలు తెలిపారు.

ఆటోను ట్రాక్టర్ ఢీకొని ఒకరు మృతి

మిర్యాలగూడ టౌన్: ఆటోను ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామ శివారులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం .. ఖమ్మంలోని రాపర్తి నగర్‌కు చెందిన సట్టు వెంకటేశ్వర్లు(35)తోపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరులోని అమరావతి రోడ్డు ప్రాంతానికి చెందిన ముటుకూరి రమ్య, బి.సత్యవతిలు కలిసి శుక్రవారం మిర్యాలగూడ మండలం బి. అన్నారం గ్రామంలో తమ సమీప బంధువు దహన సంస్కారాలకు హాజరయ్యారు. అదే గ్రామానికి చెందిన నిమ్మల నవీన్ ఆటోలో మిర్యాలగూడ వెళ్తున్నారు. వెంకటాద్రిపాలెం గ్రామ శివారులో కోదాడ–జడ్చర్ల హైవేపై దమ్ము చక్రాలతో వస్తున్నట్రాక్టర్ ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొంది. ఆటోలో ఉన్న వెంకటేశ్వర్లు, నవీన్, రమ్య, సత్యవతికి తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించగా వెంకటేశ్వర్లు అప్పటికే మృతి చెందాడు.

యువత నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

గుంటూరు ఎడ్యుకేషన్: చదువుతో పాటు యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జిల్లా ఉపాధి అధికారి డి. దుర్గాబాయి పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ డిగ్రీ కళాశాలలో శనివారం ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధత– పోటీ ప్రపంచంలో ఉపాధి అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న దుర్గాబాయి మాట్లాడుతూ యువతరం భాషా, భావ వ్యక్తీకరణ, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. సాంకేతికతను ఉపయోగించుకుని జీవితంలో అభివృద్ధి చెందడం మినహా, తప్పుడు మార్గాలకు ఉపయోగించకూడదని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. అనితాదేవి, డిగ్రీ ఇన్‌చార్జ్ భానుమురళి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దుర్గాబాయి



గుంటూరు డివిజన్ పరిధిలో రైల్వే స్టేషన్‌లలో స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను శనివారం పోలీసులు ధ్వంసం చేశారు. రైల్వే డీఎస్పీ పి.అక్కేశ్వరరావు మాట్లాడుతూ 2020 నుంచి 2024వ సంవత్సరం వరకు రైల్వే స్టేషన్‌లలో పట్టుబడిన 48 ఎక్సైజ్ కేసులలో సీజ్ చేయబడిన మద్యం బాటిళ్లను ధ్వంసం చేయడం జరిగిందన్నారు. సుమారు రూ.5 లక్షల విలువ చేసే సుమారు 830 లీటర్స్ వరకు ఉంటుందన్నారు. మద్యం బాటిళ్ల ధ్వంసం చేసిన వారిలో జీఆర్పీ సీఐ జి.అంజిబాబు, ఆర్పీఎఫ్ సీఐ వీరబాబు, ఎస్ఐలు లక్ష్మీనారాయణరెడ్డి, పి.రమేష్ ఉన్నారు. – లక్ష్మీపురం

ఇంగ్లిష్ మీడియంతో సమూల మార్పులు సాధ్యం

ఎమ్మెల్సీ, స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు లేళ్ల అప్పిరెడ్డి

నెహ్రూనగర్: కేవలం సంపన్నులు మాత్రమే కాకుండా సామాన్యులు ఇంగ్లిష్ మీడియంలో విద్యనభ్యసిస్తేనే పేద ప్రజల జీవితాల్లో సమూల మార్పులు సాధ్యమని ఎమ్మెల్సీ, స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. ఏటీ అగ్రహారంలోని ఎస్‌కేబీఎం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఇంగ్లిష్ డిక్షనరీల పంపిణీ చేశారు. గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడుతో కలసి పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ పిల్లలకు మనమిచ్చే నిజమైన ఆస్తి విద్య అని చెప్పారు. ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ఇంగ్లిష్ మీడియం దోహదం చేస్తుందని వివరించారు. ప్రపంచంలోని అత్యధిక దేశాలలోని ప్రజలు ఓవైపు తమ మాతృ భాషకు ప్రాధాన్యం ఇస్తూనే దానితో పాటు ఇంగ్లిష్ మీడియానికి పెద్ద పీట వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఓవైపు మన మాతృ భాషను కాపాడుకుంటూనే మరోవైపు ప్రపంచంలో అత్యధికంగా వాడుకలో ఉన్న ఇంగ్లిష్ భాషను కూడా అందిపుచ్చుకోవాలన్నదే మేధావుల నిశ్చితాభిప్రాయంగా వెల్లడించారు. స్ఫూర్తి ఫౌండేషన్ ఆవిర్భావం నాటి నుంచి స్పోకెన్ ఇంగ్లిష్ క్లాసులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఆంగ్ల భాషకు ఉన్న ప్రాధాన్యాన్ని గుర్తించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బందా రవీంద్రనాథ్, కార్పొరేటర్లు అడకా పద్మావతి, అచ్చాల వెంకటరెడ్డి, షేక్ రోషన్, పడాల సుబ్బారెడ్డి, ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), గురవయ్య, పావతోటి అంబేడ్కర్, దూపాటి వంశీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, గీతా మందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, డిక్షనరీ దాత రఘురామిరెడ్డి, పార్టీ నేతలు సురసాని వెంకటరెడ్డి, కొత్తపేట సతీష్, సోమి కమల్, గంగాధర్‌రెడ్డి, వనజాక్షి, రెడ్డి కోటేశ్వరరావు, భాగ్యారావు, ప్రసన్న, బెంజమిన్, నీలి, మనోజ్, రత్నకుమారి, రమణి, దుర్గ, ఆలా కిరణ్, దాసు పాల్గొన్నారు.



విద్యార్థినులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం